
సాక్షి ఒడిశా
సోమవారం । 29 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,02,628
బంగారం	11 గ్రాములు
వెండి	5 గ్రాముల 650 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



జల దిగ్బంధం

జయపురం సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో నాలుగు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. - 8లో



మావో పోస్టర్ల కలకలం

రాయగడ జిల్లాలోని అంబొదల పోలీసుస్టేషన్ పరిధి గుండిరిగుడ ప్రాంతంలో మావో బ్యానర్లు, పోస్టర్లు ఆదివారం వెలిశాయి. - 8లో

న్యూస్‌రీల్

'బిస్ మార్క్ గమనించాలి'



మాట్లాడుతున్న బిస్ మార్క్ డైరెక్టర్ పురోహిత్

పర్లాకిమిడి: బంగారం, వెండి తదితర వస్తువులు కొనేటప్పుడు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బిస్) మార్క్ గమనించాలని బిస్ మార్క్ ఒడిశా డైరెక్టర్ ఏకే పురోహిత్ సూచించారు. స్థానిక సాయి ఇంటర్నేషనల్ హోటల్‌లో వినియోగదారుల అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిస్ మార్క్ యాప్‌లో వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుల నాణ్యతపై పూర్తి వివరాలు అందిస్తారని, ఒకవేళ అలా రాకపోతే అప్రమత్తమై ఫిర్యాదు చేయవచ్చన్నారు. డూప్లికేట్ బిస్ మార్క్ వేసి బంగారం, ఇతర వస్తువులు విక్రయించే వ్యాపారులపై రూ.2 లక్షల జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష పడుతుందని తెలిపారు. స్వాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డి.జగన్నాథరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బిస్ మార్క్ హెచ్‌ఎం ప్రతినిధి అమిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు



పట్టుబడిన నిందితుడు జగన్నాథ్

జయపురం: నాటుసారా తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి ఆదివారం వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి నీలాగుడ గ్రామానికి చెందిన జగన్నాథ్ నాయిక్‌గా పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి సబ్ ఇన్‌స్పెక్టర్ శిరీష మహాపాత్రో నేతృత్వంలో ఒక పోలీసు బృందం విజయవాడ–రాంచీ 326 జాతీయ కారిడార్ బమిణిగాం ప్రాంతంలో పెట్రోలింగ్ చేపట్టారు. ఆ సమయంలో ఒక బైక్‌పై జగన్నాథ్, మరో వ్యక్తి జయపురం వైపు రావడం పోలీసులు గమనించారు. అయితే పోలీసులను చూడడంతో వారు వెనక్కి పారిపోతుండగా పోలీసులు వెంబడించారు. దీంతో జగన్నాథ్ పట్టుబడ్డగా, మరొక వ్యక్తి పరారయ్యాడు. అతని వద్ద నుంచి నాటుసారా స్వాధీనం చేసుకొని, బైక్ సీజ్ చేసి అరెస్టు చేశారు. పారిపోయిన నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కేసుని ఏఎస్ఐ పంకజినీ శబర దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.


ఆస్పత్రికి వెళ్లాలంటే అష్టకష్టాలు..!



వృద్ధుడిని మంచంపై మోసుకొని వెళ్తున్న దృశ్యం

మల్కన్‌గిరి:

జిల్లాలోని మత్తిలి సమితి మద్కపోదర్ పంచాయతీ కసరాభట గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఒక వృద్ధుడు ఆదివారం ఉదయం తవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ కోసం కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. అయితే గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో పాటు ఉన్న కొద్దిపాటి రహదారి సైతం వర్షాలకు పాడైపోవడంతో గ్రామానికి రాలేమని అంబులెన్స్ డ్రైవర్ తెలిపాడు. గ్రామానికి కొద్ది దూరంలో ఉంటామని, అక్కడి వరకు వృద్ధుడిని మోసుకు రావాలన్నారు. దీంతో చేసేదేమీలేక సుమారు 3 కి.మీ వృద్ధుడిని మంచంపై మోసుకొని వచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



హిరాకుడ్ జలాశయం నుంచి నీరు విడుదలవుతున్న దృశ్యం

జలకళ

- హిరాకుడ్ నుంచి నీరు విడుదల
- లాంఛనంగా పూజార్చన
- 20 గేట్లు నుంచి నీరు విడుదల
- లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు

భువనేశ్వర్: ఇటీవల ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీగా కురిసిన వర్షాలకు హిరాకుడ్ జలాశయానికి జలకళ సంతరించుకుంది. దీంతో వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ముందుగా ఆదివారం ఉదయం జలాశయం తీరంలో లాంఛనంగా పూజాలు చేపట్టారు. మహానది ఎగువ భాగం ఛత్తీస్‌గడ్‌లో కుంభవృష్టితో నీటిమట్టం పెరగడంతో దిగువకు అంచెలంచెలుగా 20 గేట్లు ద్వారా 3 విడతల్లో నీరు విడుదల చేశారు. ముందుగా ఉదయం 9.30 గంటలకు 7 గేట్లు, మధ్యాహ్నం 12.30 గంటలకు మరో 7 గేట్లు, మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత ఇంకో 6 గేట్లు తెరిచినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో సంబల్‌పూర్, సోన్‌పూర్, నయాగడ్, అంగుల్, బౌధ్, కటక్, పూరీ, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) ముందస్తుగా ఆదేశాలు జారీ చేశారు.

616 అడుగుల నీటిమట్టం

ఆదివారం ఉదయం 6 గంటల సమయానికి హిరాకుడ్ జలాశయంలో నీటిమట్టం 616.93 అడుగులు కాగా, సెకన్‌కు 3,16,611 క్యూబిక్ అడుగుల నీరు చేరుతోంది. అలాగే సెకన్‌కు 40,126 ఘనపుటడుగుల నీరు విడుదల అవుతున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో వరద ముంపు లేదని అదనపు ప్రత్యేక సహాయ కమిషనర్ వివరించారు. ఈనెల 30 నాటికి సగటున నాలుగున్నర లక్షల క్యూసెక్కుల వరద నీరు ఖైరమల్, ముండలిలోకి ప్రవేశిస్తాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 9 జిల్లాలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వీటిలో సంబల్‌పూర్, సోన్‌పూర్, బౌధ్, నయాగడ్, అంగుల్, కటక్ జిల్లాలు ఉన్నాయి. వీటితో జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, పూరీ జిల్లాలకు కూడా హెచ్చరికలు జారీ చేశారు. మహానది తీర ప్రాంతీయులు జాగరూకతతో వ్యవహరించాలన్నారు. నదిలోకి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లవద్దని స్పష్టం చేశారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మేజిస్ట్రేట్‌లకు ఎస్ఆర్‌సీ కార్యాలయం సూచనలు జారీ చేసింది. ఈనెల 29 సోమవారం ఉదయం 8 గంటలకు ఖైరమల్ జలాశయానికి దాదాపు 4.50 లక్షల క్యూసెక్కులు, మర్నాడు మంగళవారం ఉదయం 11 గంటలకు ముండలి జలాశయానికి దాదాపు 5 లక్షల క్యూసెక్కులు నీరు చేరుతుందని అధికార వర్గాల అంచనా. జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో జిల్లాకు చెందిన సీనియర్ అధికారులు ప్రత్యక్షంగా హాజరై ఉండాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్రం పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని అధికారులు ఆదేశించారు.

ఎట్టకేలకు..!

- తెరుచుకున్న శ్రీమందిరం 22 మెట్ల గేట్
- 2018 నుంచి మూతపడిన గేట్

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం ఆనంద్ బజార్ 22 మెట్ల గేటును దీర్ఘకాలం తర్వాత ఆదివారం తెరిచారు. పాలనాపరమైన నిర్ణయం మేరకు గత 8 ఏళ్లుగా ఈ గేటుకు తాళంపడి ఉంది. దీంతో భక్తులు మరియు సేవకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు గేటు తెరవడంతో ఈ నిర్ణయాన్ని శ్రీమందిర్ సువార్ మహాసూర్ నియోగుల సంఘం స్వాగతించింది. దీంతో ఆలయంలో రద్దీ కొంతమేర తగ్గింది. 2018 సంవత్సరంలో పోలీసు యంత్రాంగంతో సంప్రదింపులు జరిపి ఆలయ పాలక మండలి నిర్ణయం మేరకు ప్రవేశం, నిష్క్రమణ నివారిస్తు ఈ తలుపుకు తాళం వేశారు. దీంతో సింహద్వారం వద్ద 22 మెట్ల ప్రాంగణం నుంచి ఆనంద్ బజార్ సులభ మార్గం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీమందిరం లోపల ప్రధాన ప్రాంగణం నిత్యం రద్దీతో కిటకిటలాడి ఇబ్బందికరంగా మారింది.

ప్రసాదం కొనుగోలు సులభతరం

ఈ గేటు తెరవడంతో మహా ప్రసాదం కొనుగోలు సులభతరం అయింది. ప్రసాదం కొనుగోలు కోసం 22 మెట్ల ప్రాంగణంలో మలుపు తిరిగి నేరుగా ఆనంద్ బజార్ ప్రాంగణానికి చేరుతున్నారు. వాస్తవానికి ఆనంద్ బజార్ ఆవిర్భావం నుంచి ఉన్న ఈ సులభ మార్గం అధికార పెత్తనంతో మూతబడింది. ఇటీవల శ్రీమందిరం నలువైపులా ద్వారాల తలుపులు తెరిచారు. కరోనా ఆంక్షలతో మూడు ద్వారాల గుండా రాకపోకలు నివారించి అన్ని వర్గాల ప్రజలకు కేవలం సింహద్వారం గుండా మాత్రమే రాకపోకలకు అనుమతించారు. ఈ చర్యతో సింహద్వారం ప్రాంగణం నుంచి రద్దీ విపరీతమైంది. ఇటీవల మిగిలిన మూడు ద్వారాలు తెరిచారు. నలువైపులా ద్వారాల గుండా రాకపోకలు జరగడంతో రద్దీ గణనీయంగా తగ్గింది.

పనిచేయని నిఘా నేత్రాలు



పనిచేయని సీసీ కెమెరా

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ట్రాఫిక్ సమస్యతో పాటు దొంగతనాలు, దోపిడీలు నివారించడానికి గతేడాది ఆగస్టు 15వ తేదీన సుమారు రూ.46 లక్షల వ్యయంతో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గత ఆరు నెలలుగా పనిచేయడం లేదు. మొత్తం అన్ని కూడళ్లలో 116 సీసీ కెమెరాలను మున్సిపల్ యంత్రాంగం ఏర్పాటు చేయగా, వాటిలో ప్రస్తుతం 103 కెమెరాలు పనిచేయనట్లు తెలుస్తోంది. వీటి పర్యవేక్షణకు గుణుపూర్‌లోని ఆదర్శ పోలీసుస్టేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇదివరకు దొంగతనాలు, దోపిడీలు వంటి కేసుల్లో సులువుగా ఈ సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకునే విషయంలో పోలీసులు సఫలం అవుతుండేవారు. గత ఆరు నెలలుగా ఇవి పనిచేయకపోవడంతో నిందితులను పట్టుకోవడంలో కాస్త ఇబ్బంది అవుతోందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ యంత్రాంగానికి మరమ్మతులకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని తెలియజేసినప్పటికీ ఫలితం లేకపోతోంది.

కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు


ఇదిలా ఉండగా సీసీ కెమెరాల ఏర్పాటు సమయంలో భువనేశ్వర్‌కు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీకి మున్సిపాలిటీ కాంట్రాక్ట్‌ను అప్పగించింది. వీటిని ఏర్పాటు చేయడంతో పాటు వాటి మెంటెనెన్స్ పనులు కూడా ఆ సంస్థ చేపట్టాల్సిందిగా జరిగిన అగ్రిమెంటులో వివరించమైంది. అయితే సీసీ కెమెరాల ఏర్పాటు తర్వాత సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ పత్తా లేకుండా పోయింది. ఈ విషయమై మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి మనోజ్ కుమార్ తండి దృష్టికి తీసుకువెళ్లడంతో, పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని త్వరలో బాగుచేసి ఇవ్వాల్సిందిగా సంబంధిత కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు జారీ చేయడమైందని స్పష్టం చేశారు.

అధికారుల సమన్వయ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న రజనీ కాంత నాయిక్

జయపురం: స్థానిక హోటల్ స్క్వేర్ కాన్ఫరెన్స్ హాల్‌లో పబ్లిక్, పోలీసు అడ్మినిస్ట్రేటివ్ అధికారుల సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ రజనీ కాంత నాయిక్ మాట్లాడుతూ.. ప్రజలు, పోలీసులు, పాలనా యంత్రాంగం మధ్య సమన్వయం ఉన్నప్పుడే అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమన్నారు. సమన్వయ కమిటీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. సమస్యలను పరిష్కరించడంలో పోలీసు, పాలనా యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ప్రజలు కూడా పోలీసులకు, అధికారులకు సహకరించాలని, అప్పుడే మంచి వాతావరణం ఏర్పడుతుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రజనీకాంత నాయిక్, ఉపాధ్యక్షులుగా జానకీ పాణిగ్రాహి, సురేష్ కుమార హత్త, శక్తి ప్రసాద్ షాడంగి, ప్రతాప్ కుమార్ పట్నాయిక్, సతీష్ కుమార్ నందలను ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా నిరంజన్ పాణిగ్రాహి, సహాయ సంపాదకులుగా సంతును కుమార్ పండ, నిరంజన్ పాణిగ్రాహి(మున్న), కోశాధికారిగా అరవింద మహాపాత్రో, సహాయ కోశాధికారిగా సత్యదాన్ పండ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శంకర్ ప్రహరాజ్, బరున్ జైన్, రాజేంద్ర కుమార్ జెన, రాజేష్ పాత్ర, టును పండలను నియమించారు.



నూతన కార్యవర్గ సభ్యులు

కొలాబ్ నది ఒడ్డున శ్రమదానం



శ్రమదానం నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

జయపురం: పాత్రోపుట్ సమీపంలోని కొలాబ్ నది ఒడ్డున తరణి సేవాసంఘం సభ్యులు ఆదివారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. గత 8 ఏళ్లుగా తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ శ్రావణ మాసంలో నది ఒడ్డున శ్రమదానం చేపడుతున్నామని తెలియజేశారు. ఈ మాసంలో పవిత్ర శివక్షేత్రం గుప్తేశ్వరుడిని దర్శించేందుకు వేలాది మంది భోల్ భం భక్తులు గుప్తేశ్వర్‌కు వెళ్తుంటారు. వారంతా జయపురం నుంచి వెళ్తూ కొలాబ్ నదిలో స్నానాలు చేసి, పరమ శివుడిని అభిషేకించేందుకు పవిత్ర నదీ జలాన్ని కలశాలతో తీసుకెళ్తారని పేర్కొన్నారు. అందువలన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరిశుభ్రం చేయడం జరిగిందన్నారు.

సాధనతోనే లక్ష్యానికి చేరువ



విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

జయపురం: నిరంతర సాధనతోనే లక్ష్యానికి చేరువవుతామని జయపురం బ్లాక్ విద్యాధికారి చందన కుమార్ నాయిక్ అన్నారు. స్థానిక సరస్వతీ శిశు మందిర్ విద్యా మందిర్ శారదా విహార్‌లో విజ్ఞాన మేళ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇటువంటి ప్రదర్శనలు వలన విద్యార్థులు మరింత జ్ఞానం పొందే అవకాశం ఉంటున్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అధ్యాపకుడు దిలీప్ కుమార్ ప్రదర్శనల ప్రాధాన్యత, లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్ ప్రధాన్, కార్యదర్శి పంకజ కుమార్ పాత్రో, హెచ్‌ఎం సత్య నారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లాక్కొని దుండగులు పరారీ



సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన నిందితులు



బాధితుడు గౌరీ శంకరరావు

రాయగడ: స్థానిక రైల్వే రన్నింగ్ రూమ్ ప్రాంతంలో ఒక వ్యక్తి చేతిలో సెల్‌ఫోన్ లాక్కొని గుర్తు తెలియని ఇద్దరు దుండగులు పరారైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించారు. ఐఐసీ కేకేబీకే కుహరో తెలిపిన వివరాల ప్రకారం పొరుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన గేదెల గౌరీ శంకరరావు అనే వ్యక్తి తన బంధువులతో కలిసి మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి ఆదివారం వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి రైల్వేస్టేషన్‌కు నడుచుకుంటూ సరళా కూడలి వైపుగా వెళ్తున్న సమయంలో రైల్వే రన్నింగ్ రూమ్ సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు బైకుపై అడ్డంగా వచ్చారు. అనంతరం బాధితుడు ఎవరితోనే ఫోన్‌లో మాట్లాడుతుండగా లాక్కొని పరారయ్యారు. దుండగులు వినియోగించిన బైక్ ఆధారంగా జిల్లాలోని కొలనార సమితి కైలాస్‌పూర్ చందిపకొన గ్రామానికి చెందిన ముకున పిడికగా గుర్తించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని స్పష్టం చేశారు.

కోరలు చాచిన అతిసారం

- లంబారి గ్రామంలో ఇద్దరు మృతి
- వ్యాధిబారిన మరికొందరు
- అస్పత్రికి వెళ్లని గ్రామస్తులు



ఆనంద్ మాఝి(ఫైల్)



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి గోరఖ్‌పూర్ పంచాయతీ పరిధి లంబారి గ్రామంలో అతిసారంతో ఇద్దరు మృతి చెందగా, మరో పది మంది వ్యాధి బారినపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతులు గ్రామంలోని ధొనొమాఝి అనే వ్యక్తి భార్య తిలొయి (50), బొలియా మాఝి కొడుకు ఆనంద్ (28)లుగా సమాచారం. ఐదు రోజుల క్రితం ఈ వ్యాధి గ్రామంలో వ్యాపించి మంచానపడిన ఇద్దరు చివరకు ప్రాణాలు కోల్పోయారన్న సమాచారం తెలియడంతో అప్రమత్తమైన వైద్య శాఖ గ్రామానికి ఆదివారం చేరుకుంది. అది కూడా రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక దృష్టికి ఈ సమాచారం రావడంతో స్పందించిన ఆయన వెంటనే వైద్యశాఖకు తెలియజేశారు. కాగా ఈనెల 22వ తేదీన తిలొయి మృతి చెందగా, ఈనెల 26వ తేదీన ఆనంద్ మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కొండ ప్రాంతంలో ఉన్నటువంటి ఈ గ్రామంలో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో పాటు నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవడంతో అతిసారం వ్యాపించిందన్న సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏది ఏమైనప్పటికీ కాసీపూర్‌లో గత కొద్ది నెలలుగా వ్యాధుల బారినపడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. కొద్దిరోజుల క్రితం డిఫ్తీరియా వ్యాధి బారినపడి డొంగాశిలి పంచాయతీలోని మునిషిపాడొరా గ్రామంలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఈ సమితిలో ఏదో ఒక వ్యాధి బారినపడి మృత్యువాత పడుతుండడం పరిపాటిగా మారుతోంది.



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ మమత



అపరిశుభ్ర వాతవరణంలో గ్రామం

గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన

గ్రామంలో ఇద్దరు మృతి చెందడంతో వాస్తవ పరిస్థితిని అధ్యయం చేసేందుకు ఎమ్మెల్యే కద్రక గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అతిసారంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. గ్రామంలో తాగునీటి కోసం ఒకటే గొట్టపు బావి ఉండడంతో తాగునీటి సమస్య తలెత్తుతోందని, దీంతో సమీపంలోని వాగు నీరు తాగడంతో వివిధ రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా సరైన రహదారి లేకపోవడంతో అనారోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు చికిత్స కోసం సకాలంలో వెళ్లలేకపోతున్నామని వాపోయారు. దీంతో గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని, వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అవగాహన లేకపోవడం విచారకరం

ఇప్పటికీ ప్రజల్లో వ్యాధులపై అవగాహన లేకపోవడం విచారకరమని గ్రామంలో పర్యటించిన జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ మమత చౌదరి అన్నారు. ఆదివారం ఆమె లంబారి గ్రామంలో పర్యటించారు. ఇంటింటా తిరిగి వివరాలు సేకరించారు. వ్యాధి సంక్రమిస్తే వైద్యులను సంప్రదించాల్సింది పోయి, అలాగే ఇంటిలో ఉండిపోవడం దురదృష్టకరమన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఆస్పత్రికి రావాలని కోరారు. అయితే తాము ఎక్కడికీరామని, గ్రామంలోనే ఉంటామని గ్రామస్తులు స్పష్టం చేశారు. దీంతో గ్రామంలోనే వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపరుస్తామన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి ప్రేరణకు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక



బూర్జ: జాతీయ స్థాయి ప్రేరణ కార్యక్రమానికి బూర్జ మండలం కొల్లివలస కేజీబీవీ విద్యార్థిని గుజ్జల లిఖిత ఎంపికైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ కె.గాయత్రి ఆదివారం తెలియ జేశా రు. ఈ విద్యార్థిని ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లిఖిత ఎంపికైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో జరిగే ప్రేర ణ కార్యక్రమానికి ఆమె హాజరవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో ప్రిన్సిపాల్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులతో పీడీలు

పాతపట్నం: పాతపట్నం ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. ఆదివారం జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఎంపికలను నిర్వహించామని అసోసియేషన్ అధ్యక్షుడు జి.అప్పన్న తెలిపారు. సీనియర్ పీడీలు వై.శేఖర్ బాబు, జె.కృష్ణ, జె.శ్రీను, బి.లోకేష్, సుజాత, దుర్గమ్మ పర్యవేక్షణలో క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. జిల్లా స్థాయిలో బాలురు 35మంది, బాలికలు 25 మంది ఎంపికయ్యారు. వీరు విజయవాడ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం టెన్నిస్ కోర్టులో ఆగస్టు 4, 5వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

మూడు ఇసుక లారీలు, ట్రాక్టర్, జేసీబీ సీజ్



అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతంలో ఇసుక దోపిడీ పెద్ద ఎత్తున జరుగుతోంది. ఒక వైపు అధికారులు ఇసుక అక్రమ రవాణా వద్దంటూ హెచ్చరిస్తూ నదిలోకి వాహనాలు వెళ్లనీయకుండా గోతులు తీస్తున్నా రాత్రి వేళల్లో ఆ గోతులు పూడ్చుకొని దందాకు ఎగబడుతున్నారు. మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతం సీపానపేట-నిమ్మతొర్లువాడ గ్రామాల మధ్యలో ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం రాత్రి నదిలో జేసీబీలను దించి ట్రాక్టర్లు, లారీలకు ఇసుక ఎత్తిపోశారు. దీనిపై దాడులు నిర్వహించి మూడు లారీలు, జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్ ఆదివారం తెలిపారు. దీనిపై కేసు నమోదుచేశామని పేర్కొన్నారు.

10, 11 తేదీల్లో జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ స్విమ్మింగ్ పూల్ వేదికగా ఆగస్టు 10, 11 తేదీల్లో జిల్లాస్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల చాంపియన్‌షిప్ పోటీలతోపాటు అదేరోజు రాష్ట్ర పోటీలకు క్రీడాకారుల ఎంపికలను నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. 5 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారికి వివిధ స్థాయిల్లో పోటీలను నిర్వహించడంతోపాటు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. అలాగే గ్రూప్-1 నుంచి గ్రూప్-6 మధ్య 5 ఏళ్ల నుంచి 17 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన క్రీడాకారులకు ఎంపిక పోటీలను నిర్వహించి రాష్ట్రపోటీలకు పంపించేలా చర్యలు తీసుకోనున్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా క్రీడాకారులను పల్నాడు జిల్లా నర్సారావుపేటలోని ఎస్ఎస్ఎన్అండ్ఎన్ కాలేజీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్, వాటర్‌పోలో పోటీలకు పంపించనున్నారు. జిల్లాస్థాయి స్విమ్మింగ్ మీట్ కమ్ సెలెక్షన్ ట్రయల్స్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసు కోవాలని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎస్ఎస్‌వీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.ఝాన్సీ పిలుపునిచ్చారు. క్రీడాకారులు స్విమ్మింగ్ పూల్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ఎంట్రీ ఫీ జుగా రూ.200, ఈవెంట్‌కు రూ.50 చొప్పున చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరా రు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీ సుకురావడం తప్పనిసరని, వివరాలకు 94935 09090న సంప్రదించాలన్నారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు ప్రత్యేకంగా పూజలు చేయించుకున్నారు. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.69,300, విరాళాల రూపంలో రూ. 87,653, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.50 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లుగా అధికారులు తెలియజేశారు.

ముఖ్యమంత్రుల సమావేశానికి సీఎం మోహన్ చరణ్



ప్రధానమంత్రి నరేంద్రమోదీతో బీజేపీ సీఎంలు

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆదివారం జరిగిన బీజేపీ ముఖ్యమంత్రి మండలి సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరయ్యారు. ఆయనతో పాటు రాష్ట్రం నుంచి ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా ఉన్నారు. న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో వీరంతా సమావేశమయ్యారు. సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా, హోం మంత్రి అమిత్ షా, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రధానమంత్రి మార్గనిర్దేశం చేశారని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా తెలిపారు. దానిని విజయవంతంగా అమలు చేయడానికి మా బృందం కృషి చేస్తుందన్నారు.

జల దిగ్బంధం

- నాలుగు గ్రామాలకు రాకపోకలు బంద్



పొంగుతున్న నదిలో నడుస్తూ నిత్యావసరాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో కుండపోత వర్షాలు కురవడంతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. కొరాపుట్ జిల్లాలో అత్యధిక వర్షం బొయిపరిగుడ సమితిలో పడింది. గత మూడు రోజుల్లో 163 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవ్వగా, గత 24 గంటల్లో 50 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో బొయిపరిగుడ సమితి చెరమ గ్రామ పంచాయతీలో నాలుగు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. పారియజొడి నది పొంగిపొర్లుతుండడంతో ఆ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నిత్యావసర సరుకులు సైతం పొందలేకపోతున్నారు. మరోమార్గం లేక కుటుంబాలను వస్తులతో ఉంచలేక కొంతమంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని, నడుం ఎత్తున పారుతున్న నది నీటిని దాటుకుంటూ అవతలి ఒడ్డుకు చేరుకొని, నిత్యావసర సరుకులను తీసుకొస్తున్నారు.

అచ్యుత సామంత్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అచ్యుత సామంత్

భువనేశ్వర్: జపాన్‌లోని ప్రతిష్టాత్మకమైన కొయాసన్ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోని కిట్, కిస్ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ అచ్యుత సామంత్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఇది డాక్టర్ అచ్యుత సామంత్‌కు 58వ గౌరవ డాక్టరేట్ కావడం విశేషం. కొయాసన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ సోయిడా ర్యూషో ప్రతిష్టాత్మక డిగ్రీని నిఖిలేష్ గిరి, కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా, ఒసాకా-కోబ్ మరియు ఇతర విశ్వవిద్యాలయ ప్రముఖుల సమక్షంలో అందజేశారు. విద్య, సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందించారని ఆయన తెలిపారు. 160 ఏళ్ల పురాతనమైన కొయాసన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పొందిన రెండో భారతీయుడిగా డాక్టర్ అచ్యుత సామంత్ నిలిచారు. 2014-2019 కాలంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగిన దేవేంద్ర ఫడ్నవీస్ తొలి భారతీయునిగా ఈ గౌరవ డాక్టరేట్‌ని పొందారు.



సీడ్ బాల్స్ తయారు చేస్తున్న స్కూల్ విద్యార్థులు

• భూమి కోసం..

బీజ మంత్రం



భూమాతకు ఆకుపచ్చ పట్టుచీర చుట్టేందుకు భగీరథ ప్రయత్నం జరుగుతోంది. రేపటి తరం స్వచ్ఛమైన గాలి పీల్చుకునేందుకు బృహత్తర క్రతువు మొదలైంది. నింగికి నేలకు వానబంధం తెగిపోకుండా ఉండేందుకు 'బీజ' మంత్ర పారాయణం ప్రారంభమైంది. రానున్న ఐదేళ్ల కోసం 'పచ్చ'వర్ణ ప్రణాళిక రచిస్తూ విద్యార్థులు విత్తన బంతులు తయారు చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా లక్ష విత్తన బంతులు తయారు చేసి నేల తల్లికి కానుకగా ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు.

- పర్యావరణ రక్షణ కోసం విశిష్ట ప్రయత్నం
- లక్ష విత్తన బంతుల తయారీ
- 20 స్కూళ్లలో క్రతువు
- ఈ నెలాఖరుతో ముగియనున్న స్పెషల్ డ్రైవ్

శ్రీకాకుళం కల్చరల్:

ఈ రోజు కంటే రేపు స్వచ్ఛమైన గాలి జనులకు అందాలి. నేటి కంటే రేపు అధికంగా వానలు కురవాలి. ఐదేళ్ల తర్వాత మన చుట్టుపక్కల ప్రాంతమంతా ఆకుపచ్చ రంగులో కళకళలాడాలి. ఈ సత్సంకల్పమే విద్యార్థుల చేత విత్తన బంతులు తయారు చేయిస్తోంది. లక్ష విత్తన బంతుల తయారీలో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు నిమగ్నమై ఉన్నారు. ఈ యజ్ఞం పూర్తయ్యి, ఆ విత్తనాలు మొక్కలుగా పెరిగి, వృక్షాలుగా పెరిగితే పర్యావరణం బృందావనంలా మారుతుంది.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జూన్ 5 నుంచి ఆగస్టు 19 వరకు జిల్లాలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ తలపెట్టారు. భావితరాలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూనే విద్యార్థులకు విత్తన బంతుల తయారీ బాధ్యతను అప్పగించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్లపూడి రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జిల్లాలోని స్కూళ్లలో నిర్వహిస్తున్నారు. మొక్కలు పెంచడానికి అవసరమైన సీడ్ బాల్స్‌ను ఎలా తయారు చేయాలనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటుగా వారితోనే నేరుగా తయారు చేయిస్తున్నారు. ఈ నెలాఖరులోగా 20 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

ఎలా తయారు చేస్తారు.?

విత్తన బంతులు తయారీకి అవసరమైన వస్తువులను ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు పట్టుకొని స్కూళ్లకు వెళ్లి విద్యార్థుల చేత తయారు చేయిస్తున్నారు. అందుకోసం పొలం మట్టి, వేపపిండి, కొబ్బరి పొట్టు, ఊక కాల్చిన బూడిదలను మొత్తంగా కలిపి వాటి మధ్యలో విత్తనాన్ని ఉంచి బంతులు తయారు చేస్తారు.

ఐదేళ్ల ప్రణాళిక

విద్యార్థులు తయారు చేసిన లక్ష విత్తన బంతులను డ్రోన్స్ ద్వారా కాని, ఇండియన్ ఎయిర్ పోర్సు ద్వారా కాని వర్షపాతం తక్కువగా ఉన్న మండలాలు, కొండ ప్రాంతాల్లో వెదజల్లే కార్యక్రమం జరుగుతుంది. ఈ విధంగా ఐదేళ్ల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. చల్లిన విత్తనాల్లో 25 వరకు మొక్కలుగా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఈ ప్రణాళిక 5 ఏళ్లు కొనసాగిస్తే దేశ మంతా పచ్చదనంతో కళకళలాడుతుందని నిర్వాహకుల అభిప్రాయం. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తోంది.

చాలా సరదాగా ఉంది

ఈ పనిచేయడం చాలా సరదాగా ఉంది. విత్తనాలు మట్టిలో పెట్టి బాల్స్‌లాగా చుడుతున్నాం. చాలా చేశాను నేను.

– జి.మోక్షిత్, 6వ తరగతి, జేవై స్కూల్, న్యూకాలనీ

అందరం కలిసి చేశాం



మా స్నేహితులందరం కలిసి విత్తన బంతులు చేశాం. ఎంతో మంచి పని చేస్తున్నా మని మా టీచర్ మమ్మల్ని మెచ్చుకున్నారు. నేను ఎక్కువ చేశాను.

– కె.జయంత్, 6వ తరగతి, జేవై స్కూల్, న్యూకాలని



విత్తన బంతులు చేస్తున్న విద్యార్థులు

గర్వంగా ఉంది

మొక్కల పెంపకం అంటే నాకు ఇష్టం. ఈ పద్ధతిలో విత్తనాలు మా చేత తయారు చేయించడం ఎంతో సరదాగా ఉంది. మా స్కూల్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాళ్లు నిర్వహిస్తున్న కార్యక్రమంలో మేము భాగస్వామ్యం కావడం ఎంతో గర్వంగా ఉంది.

– పి.సహస్ర, 8వ తరగతి, జేవై స్కూల్, న్యూకాలనీ

సహజ సిద్ధంగా పండించాలి



జిల్లాలో ఈ నెలాఖరులోగా 20 స్కూళ్లకు వెళ్లి వారితో విత్తన బంతులు తయారు చేయిస్తాం. ఎవరైనా స్కూళ్ల వద్ద ఇలా తయారు చేసేందుకు సిద్ధపడితే 8639456848 నంబరును సంప్రదించాలి.3600 రకాల విత్తనాలు రెడీగా ఉన్నాయి.

– డి.రవి, ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి

• విజయీభవ..!



పారిస్ ఒలింపిక్స్-2024లో పాల్గొన్న భారత క్రీడాకారులు విజయాలతో తిరిగి రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, విపక్ష నేత నవీన్ పట్నాయక్ తదితర ప్రముఖులు ఆకాంక్షించారు. ఈ క్రీడల్లో తొలి పతకాన్ని భారతదేశానికి అందించిన మనూ భాకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పూల్ బీ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 3-2 తేడాతో ఒలింపిక్స్‌లో తమ జైత్రయాత్రకు శ్రీకారం చుట్టిన భారత పురుషుల హాకీ జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాబోయే మ్యాచ్‌ల్లో ఇదే జోరు కొనసాగించాలన్నారు. అలాగే తొలి పతకం సాధించిన ఏస్ షూటర్ మనూ భాకర్‌కు ప్రసిద్ధ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ సృజనాత్మకంగా సైకత శిల్పంతో శుభాకాంక్షలు తెలిపారు. ఆమె విజయం పురస్కరించుకుని పూరీ సాగర తీరంలో ఆకర్షణీయమైన సైతక శిల్పం తీర్చిదిద్దారు.

– భువనేశ్వర్

మావో పోస్టర్ల కలకలం



మావోయిస్టులు ఏర్పాటు చేసిన బ్యానర్



లభ్యమైన పోస్టర్లు

రాయగడ: ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు జిల్లాలో మావోయిస్టులు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి ఉనికిని చాటుకునేవిధంగా జిల్లాలోని అంబొదల పోలీసుస్టేషన్ పరిధి గుండిరిగుడ ప్రాంతంలో మావో బ్యానర్లు, పోస్టర్లు ఆదివారం వెలిశాయి. ప్రజా సమస్యలపై పోరాడుతూ అమరులైనవారికి నివాళులు అర్పించేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని వంశధార, ఘుముసుర నాగావళి డివిజన్ కమిటీ పేర్కొంది. ప్రతి ఒక్కరూ వారోత్సవాలకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు గుండిరిగుడ గ్రామానికి చేరుకుని పోస్టర్లు, బ్యానర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని భరోసా ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై

అప్రమత్తంగా ఉందాం

- జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ
- ఉద్యోగులపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి మండిపాటు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, పక్కనే ఎమ్మెల్యే రమణమూర్తి

అరసవల్లి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉందామని, వసతి గృహాలను పర్యవేక్షించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 1వ, 2వ, 4వ, 7వ జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె అధ్యక్షురాలిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు శాఖల ప్రగతిపై ఆమె సమీక్షించారు. ఇటీవల సీజనల్ వ్యాధులతో కొందరు విద్యార్థులు వసతి గృహాల్లో మృతి చెందడం ఎంతో బాధించిందని అన్నారు. వెన్నెలవలస ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థిని మలేరియాతో చనిపోయిన తర్వాత అధికారులు స్పందించడం, టెస్టులు, మందులంటూ హడావుడి చెయ్యడం సరికాదని, అసలు ఇలాంటి దుస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్పీ సమావేశాలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన జిల్లా స్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని లేదంటే చర్యలుంటాయన్నారు. అనంతరం మధ్యాహ్నం వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి 3వ, 5వ, 6వ స్థాయీ సంఘ సమావేశాలకు అధ్యక్షత వహించి ముగించారు.

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ... పోలాకి, జలుమూరు తదితర మండలాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. అలాగే గత ప్రభుత్వంలో చేపట్టిన పనులేవీ ఇప్పుడు అకారణంగా నిలిపివేయద్దని తెలిపారు.
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ భారీ పరిశ్రమలు బోర్లు తవ్వుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఉద్యోగులపై కూన ఆగ్రహం

జెడ్పీ సమావేశాలకు ఉన్నతాధికారులు హాజరు కావడం లేదని, వచ్చిన అధికారులు కూడా కాలేజీ స్టూడెంట్లలా వస్తూ.. సమాచారం లేకుండా మాట్లాడుతున్నారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి మండిపడ్డారు. జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ 2019 మార్చి 31 నాటికి జిల్లాలో అన్ని శాఖల ఇంజినీరింగ్ పనులకు చెందిన పెండింగ్ ప్రోగ్రెస్ వివరాలను తర్వాతి సమావేశానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమదాలవలస రోడ్డుకు మరో 15 రోజుల్లో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపులు చేయిస్తానని సభలో మాటిస్తున్నానని, వెంటనే పనులు చేపట్టే బాధ్యత తీసుకోవాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. కీలకమైన శ్రీకాకుళం పంచాయతీరాజ్ శాఖ పీఆర్ఐ ఈఈ పోస్టును అనకాపల్లికి పంపించేశారని, ఆ పోస్టును తెప్పించేలా తీర్మానించాలని జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావుకు ఆదేశించారు. అలాగే ఉపాధి నిధులతో నిర్మించిన మిల్క్ బల్క్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలను జిల్లా వ్యాప్తంగా నిలిపివేయాలని, దీనిపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానన్నారు. అలాగే సొంతంగా బతకాల్సిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఆ సంస్థ ఇప్పుడు అధోగతికి చేరిందన్నారు. ఇక రాష్ట్రానికి త్వరలో బుందేల్‌ఖండ్ ప్యాకేజి రానుందని, తద్వారా జిల్లాకు వెనుకబడిన జిల్లా కోటాలో రూ.50 కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు.

• ఆకాశ వీధిలో..

దాదాపు వారం రోజుల తర్వాత ఆకాశ వీధిలో సూరీడి గమనం కనిపించింది. సాయంత్రం సమయంలో లొద్దపుట్టి ప్రాంతంలో మేఘాలు ఇలా కనువిందు చేశాయి.

– ఇచ్ఛాపురం రూరల్



క్లుప్తంగా

'గంజాయి' నియంత్రణకు ప్రత్యేక బృందం

● ఎస్పీ వకుల్ జిందాల్



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటుచేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే అన్ని రహదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు, వాహనాల రికార్డులను పరిశీలించి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు ఈ చలానాలు విధిస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు, గంజాయి పీల్చే వారిని అదుపులోకి తీసుకునేందుకు, వారికి గంజాయి సరఫరా చేసే వ్యాపారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని నియమించామని తెలిపారు. ఈ బృందాలు జిల్లాలో ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, గంజాయి పీలుస్తూ అర్లర్లకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు స్థానిక పోలీసులకు అప్పగిస్తారన్నారు. అంతేకాకుండా, వారికి గంజాయి సరఫరా చేస్తున్న చిన్న వ్యాపారులను, వారికి పెద్ద మొత్తంలో విక్రయించే పెద్ద వ్యాపారులను, వారికి గంజాయి విక్రయించే వ్యక్తులను గుర్తించి, గంజాయి అక్రమ రవాణా నియంత్రణే లక్ష్యంగా ఈ ప్రత్యేక బృందం పనిచేస్తుందన్నారు.

పదేపదే నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్ నమోదు

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జరిపే నిందితులు పదే పదే నేరాలకు పాల్పడి, పట్టుబడితే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. గంజాయి గురించిన సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఫోన్ నంబర్ 9121109416కు తెలియజేయాలని ప్రజలను ఎస్పీ కోరారు.

స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పోస్టుకు అర్హత, ఆసక్తి కలిగిన పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ/జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఫిజికల్ డైరెక్టర్లు) ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ జి.పగడాలమ్మ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్‌గేమ్స్ సెక్రటరీగా 2 సంవత్సరాల పదవీకాలం ఉంటుందని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలలో పదవీ విరమణ పొందనున్న ఉపాధ్యాయులు, గతంలో స్కూల్‌గేమ్స్ సెక్రటరీగా పని చేసిన వారు, క్రమశిక్షణ చర్యలకు గురైన వారు అనర్హులని పేర్కొన్నారు. పైన తెలిపిన నిబంధనల మేరకు ఈ నెల 29 లోగా ప్రధానోపాధ్యాయుడు, ఉప విద్యాశాఖాధికారి కౌంటర్ సైన్‌తో కార్యాలయం పనిదినాల్లో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని స్పష్టం చేశారు.


రెండు బైక్‌లు ఢీకొని మహిళ మృతి



మృతురాలు లక్ష్మి (ఫైల్)

భోగాపురం: జాతీయ రహదారిపై భోగాపురం మండలంలోని అమనాం జంక్షన్ వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఆదివారం ఓ మహిళ మృతిచెందింది. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పూసపాటిరేగ మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన తిరుమల లక్ష్మి(51) భర్త రమణరాజు 20 సంవత్సరాలుగా గ్రామానికి సమీపంలో గల తోటలో పనిచేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నారు. ఈ మధ్య (ఆరు నెలల క్రితం) వారి కుమారుడి వివాహం జరిగింది. వృత్తి రీత్యా కుమారుడు భార్యతో కలిసి విశాఖపట్నం జిల్లా పరవాడలో నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో కొడుకు, కోడలిని చూసేందుకు లక్ష్మి పరవాడ వెళ్లింది. తిరిగి ఆదివారం కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై కృష్ణాపురం వస్తుండగా అమనాం జంక్షన్‌కు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి ఎదురుగా వెళ్తున్న చీపురుపల్లి గ్రామానికి వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వరరావుతో పాటు తల్లీకొడుకులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే లక్ష్మి మృతి చెందింది. ద్విచక్ర వాహన చోదకులు ఇద్దరూ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. మృతురాలి భర్త రమణరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

పత్తితోటలో ఏనుగులు



పత్తితోటలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని కుందరతిరువాడ గ్రామంలో పత్తితోటలో ఆదివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. చెరకు, అరటి, పామాయిల్ తోటల్లో ఉన్న ఏనుగులు వరి, పత్తి చేనులోకి జారుకున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నా అటవీశాఖాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

కబేళా నుంచి గోవులకు విముక్తి

- సుమారు 400 కిలోల గోమాంసం సీజ్
- ఏకమైన హిందూ ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు
- ఎస్పీ చొరవతో గోశాలకు గోవులు
- పరారీలో నిర్వాహకులు



లోపల ఉన్న లేగదూడలు



కబేళా గేటు బయట నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ ధార్మిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



కబేళా లోపల లభ్యమైన గోమాంసం

విజయనగరం క్రైమ్: సకల దేవతలు కొలువైన మాతగా హిందూ ధర్మ ఆచార సంప్రదాయాల ప్రకారం గోవుకు అత్యంత ప్రాశస్త్యం ఉంది. అటువంటి గోవులను నిర్దాక్షిణ్యంగా నరికేసి, వాటి మాంసాన్ని అమ్ముకుంటూ డబ్బులు సంపాదించాలనుకునే దుండగుల చెర నుంచి 203 గోవులకు ఎస్పీ వకుల్ జిందాల్ విముక్తి కల్పించారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరంలోని కొత్తపేట స్వీపర్ వీధిలో కొన్నేళ్లుగా కబేళా నడుస్తున్నప్పటికీ ఇంతవరకూ పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. కబేళాకు తీసుకువచ్చిన గోమాతలను మాంసం ముద్దలుగా తయారుచేసి ప్యాకింగ్‌లు చేసి, బహిరంగంగా తరలించేస్తున్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకున్న పాపాన పోలేదన్నది వాస్తవం. అయితే శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కబేళాకు వందల సంఖ్యలో గోవులు తరలివెళ్తున్నట్లు చూసిన హిందూ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రతిఘటించారు. అప్పటికే కబేళా లోపలికి గోవులను తరలించిన నిర్వాహకులు తాళాలు వేసేశారు. అయితే గోమాతలను రక్షించుకోవాలనే ఉద్దేశంతో ఆయా సంఘాల ప్రతినిధులు తెల్లారేవరకూ కబేళా గేటు బయటే ఉండి ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎస్పీ ఆదేశాలతో టూటౌన్ పోలీసులు రంగంలోకి దిగారు. ఆదివారం మధ్యాహ్నం వరకూ హైడ్రామా నడిచింది. లోపల ఉన్న వారంతా పరారయ్యారు. గేటు బయటే హిందూ ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్పార్క్ సొసైటీ వ్యవస్థాపకుడు పద్మనాభంతో పాటు పలువురు ధర్నా నిర్వహించారు. కబేళాను గోశాలగా మార్చాలని, లేగదూడలను, ఆవులను దారుణంగా నరికినవారిని, అదేవిధంగా అవినీతికి పాల్పడి రెండు వ్యాన్‌లను రాత్రి సమయంలో వదిలేసిన పోలీస్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కబేళాను వెంటనే మూసివేయాలని భీష్మించారు. కబేళాలో ఉన్న ఆవులను బయటకు తీసుకువచ్చి దాణా పెట్టాలని కోరారు. పోలీసుల సాయంతో గేట్లు పగులగొట్టి లోపలికి వెళ్లిన వారు గోమాంసంతో పాటు 203 గోవులను గుర్తించారు. సుమారు 400 కిలోల గోమాంసం స్వాధీనం చేసుకున్నట్లు, కోర్టు ఆర్డర్ తీసుకుని ఆ మాంసాన్ని పాతిపెట్టిస్తామని సీఐ కె.రామారావు చెప్పారు. గోవులను గోశాలకు తరలిస్తామన్నారు. మహ్మద్ ఖలీల్ కబేళాను నడుపుతున్నాడని. అతనితో పాటూ మిగతావారు పరారీలో ఉన్నారని తెలిపారు. వారందరినీ అదుపులోకి తీసుకుని, విచారణ చేసి, కేసులు నమోదుచేస్తామని, రెండు వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ స్పష్టం చేశారు.



తిండిలేక విలవిల్లాడిపోతున్న గోమాతలు

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ కార్యకర్త మర్రాపు సత్యంనాయుడు మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదివారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి పార్టీ తరఫున ఎటువంటి అవసరం ఉన్నా శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో శిఖబడి సర్పంచ్ కోట రమేష్, గవరమ్మపేట సర్పంచ్ కొల్లి సత్యం నాయుడు, ఎంపీటీసీ మర్రాపు లక్ష్మంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లు ఈశ్వరరావు కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ రవాణాను అరికడదాం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో మానవ అక్రమ రవాణను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఈనెల30న జరుపుకోనున్న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఆదివారం ఆయన హెల్ప్, విముక్తి సంస్థలు రుపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత అన్ని శాఖల విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, సైబర్ నేరాలను కూడా నియంత్రించడానికి నిరంతర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు జి. హిమబిందు, మిషన్ వాత్సల్య ప్రతినిధి బి. రామకోటి, చైల్డ్‌లైన్ ప్రతినిధులు మీనా, గౌరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో చీపురుపల్లి యువకుడి మృతి



మహేష్

చీపురుపల్లి: పట్టణానికి చెందిన కిల్లంశెట్టి మహేష్(25) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బజారువీధికి చెందిన మహేష్ హైదరాబాద్‌లో కొరియర్ డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 25న కొరియర్ డెలివరీకి వెళ్తున్న సమయంలో కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. అయితే బయటకు ఎలాంటి గాయాలు లేకపోవడంతో మహేష్ యథావిధిగా తన రూమ్‌కు వెళ్లిపోయాడు. తరువాత రాత్రి సమయంలో మహేష్ కోమాలోకి వెళ్లిపోవడంతో స్నేహితులు గమనించి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఎంఈఓల బదిలీలు చేపట్టాలి

విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం

ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: మండల విద్యాశాఖాధికారులకు జీరో సర్వీస్‌తో బదిలీలు చేపట్టాలని ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఈఓలకు దాదాపు ఏడేళ్లుగా బదిలీలు జరగలేదని, 2017 నుంచి పనిచేస్తున్న స్థానాల్లోనే చాలామంది ఎంఈఓలు పనిచేస్తున్నారని, వారిలో చాలామంది బదిలీల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మండలంలో దాదాపు రెండు వందల మంది టీచర్లకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎంఈఓలకు తమ జీతభత్యాల కోసం సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కావున ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరుతూ ఇటీవల విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు సామల సింహాచలం తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి



మృతురాలు గౌరి (ఫైల్)

గజపతినగరం: మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన ఓ మహిళ పాము కాటుకు గురై వైద్యసేవలు పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేజేటి గౌరి (47) తమ పొలంలో పండిన నువ్వు పంట కుప్పలను శనివారం చేయి పెట్టి పరిశీలిస్తుండగా విషసర్పం కాటు (ఉల్లిపాము) వేయడంతో వెంటనే అస్వస్థతకు గురి కాగా స్థానికులు, బంధువులు గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు గజపతినగరం ఎస్సై యు.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు చిన్నగుడ్లు!

- గుడ్డు బరువు 50 గ్రాములు ఉండాలి
- 35-40 గ్రాములే ఉంటున్న గుడ్లు
- జిల్లాలో అంగన్‌వాడీ లబ్ధిదారులు 86,538 మంది
- నెలకు రూ.21.63 లక్షల గుడ్లు వినియోగం



పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయిన చిన్నసైజు గుడ్లు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు గుడ్ల సరఫరాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిచ్చిక గుడ్ల వలే ఉన్నాయంటూ లబ్ధిదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది అధికారులకు తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపిస్తున్నారు. సాధారణంగా 50 గ్రాములు బరువు ఉండే గుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలి. ప్రస్తుతం 35-40 గ్రాములు ఉన్న గుడ్లనే సరఫరా చేస్తున్నారు. సబంధిత కాంట్రాక్టర్ గుడ్లను కేంద్రాలకు సరఫరా చేసే సమయంలో సూపర్ వైజర్ పర్యవేక్షించాలి. ఇది ఎక్కడా కానరావడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలి. పిల్లలకు ప్రతిరోజు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. గర్భిణులు, బాలింతలకు కూడా టేక్ హోమ్ రేషన్ కింద నెలకు 25 గుడ్లు సరఫరా చేయాలి. వీటితో పాటు పిల్లలకు మధ్యాహ్న భోజనం, పాలు, గర్భిణులకు నెలకు సరిపడా పాలు, చెక్కీలు, బెల్లం, రాగిపిండి, కర్జూరం వంటివి అందిస్తారు.

చర్యలు తీసుకుంటాం

అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు గుడ్లు సరఫరా అవుతున్నట్టు తన దృష్టికి రాలేదు. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. పెద్దసైజు గుడ్లు సరఫరా చేసేలా ఆదేశాలు ఇస్తాం. – బి.శాంతకుమారి, పీడీ, ఐసీడీఎస్

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. 11 ప్రాజెక్టుల్లో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 7 నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలు 44,745 మంది, 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు 23,255 మంది, గర్భిణులు 9,930 మంది, బాలింతలు 9,668 మంది ఉన్నారు. వీరికి నెలకు 21.53 లక్షల గుడ్లు అవసరం. అధికారులు స్పందించి పెద్దసైజు గుడ్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జిల్లాకు 480 మెట్రిక్ టన్నుల డీఏపీ రాక

● జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



గూడ్సు రైలు నుంచి లారీలకు ఎక్కిస్తున్న డీఏపీ ఎరువులను పరిశీలిస్తున్న తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసే నిమిత్తం 480 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులతో కూడిన గూడ్సు రైలు వ్యాగన్ ఆదివారం జిల్లాకు వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. ఈ ఎరువులను ఇప్పటికే ఇండెంట్ పెట్టిన 38 రైతు భరోసా కేంద్రాలు (రైతు సేవా కేంద్రాలు)కు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గూడ్సు షెడ్డుకు వచ్చిన డీఏపీ రేక్ మార్క్‌ఫెడ్ మేనేజర్‌తో కలిసి పరిశీలించి లారీలు ద్వారా తరలించే ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాలకు డీఏపీ ఎరువు పంపించినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో, ప్రైవేటు డీలర్ల వద్దగానీ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సంబంధిత రైతులు మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ సహాయ సంచాలకులు నాగభూషణం, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరనాయుడు తదితరులు ఉన్నారు.

కుష్ఠుతో చాలా కష్టం

- జిల్లాలో విస్తరిస్తున్న వ్యాధి
- ఇంటింటి సర్వేలో నమోదవుతున్న కొత్త కేసులు
- ఇప్పటివరకు 2,932 మంది అనుమానితుల గుర్తింపు
- 912 మందికి పరీక్షలు
- 16 మందికి వ్యాధి నిర్ధారణ
- ఈనెల 18న ప్రారంభమైన ఇంటింటా సర్వే



గంట్యాడ మండలంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



శరీరంపై ఉన్న కుష్ఠు వ్యాధి మచ్చలు

విజయనగరం ఫోర్ట్: కుష్ఠు వ్యాధి జిల్లాలో చాప కింద నీరులా వ్యాపిస్తోంది. జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటింటా నిర్వహించే సర్వేలో కొత్త కేసులు బయట పడుతున్నాయి. కుష్ఠు వ్యాధిపై అవగాహన లేకపోవడం, వ్యాధి లక్షణాల గురించి బయటకు చెబితే ఏమనుకుంటారోననే అవమానంతో వ్యాధి తీవ్రమయ్యే వరకు చాలామంది బయటకు చెప్పడం లేదు. దీంతో కుష్ఠు వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల వ్యాప్తిని అరికట్టగలగడంతో పాటు రోగులు అంగవైకల్యం బారిన పడకుండా కాపాడడానికి అవకాశం ఉంటుంది.

16 కొత్త కేసులు నమోదు

జిల్లాలో ఈనెల 18 వతేదీ నుంచి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే ఇంటింటా ప్రారంభమైంది. ఈ సర్వేలో 1790 టీమ్‌లు పనిచేస్తున్నాయి. ఇప్పటి వరకు 2,63,338 ఇళ్లలో 8,49,283 మందిని సర్వే చేశారు. ఈ సర్వేలో 2,932 మందికి వ్యాధి లక్షణాలున్నట్లు అనుమానితులను గుర్తించారు. వారిలో ఇప్పటివరకు 916 మందికి పరీక్షలు చేయగా 16 కొత్త కేసులు నమోద య్యాయి. జిల్లాలో ప్రస్తుతం 272 మంది కుష్ఠు వ్యాధి చికిత్స పొందుతున్నారు.

రోజుకు 20నుంచి 25 ఇళ్ల సర్వే

ఆశవర్కర్, మేల్ వలంటీర్‌తో కూడిన టీమ్ వారి పరిధిలోని 20 నుంచి 25 ఇళ్లను ప్రతి రోజూ సర్వే చేస్తున్నారు. ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరినీ సర్వే చేస్తారు. స్పర్శ, నొప్పి లేని మచ్చలు ఏమైనా ఉన్నాయా అని వైద్య సిబ్బంది అడిగి వివరాలు నమోదు చేసుకోవాలి. సర్వే సిబ్బందికి సందేహాలు ఉంటే సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారిని సంప్రదించి నివృత్తి చేసుకుంటారు.

వ్యాధి లక్షణాలు

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, బత్తాయి తొక్కలా ఉండడం
- చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బొడిపెలు
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం
- కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతి వేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

వ్యాధి సోకేది ఇలా

కుష్ఠు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల సోకుతుంది. ఈ వ్యాధి చర్మానికి, నరాలకు సోకుతుంది. వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి కుష్ఠు వ్యాధి సోకే ఆస్కారం ఉంది.

చికిత్స రెండు రకాలు

పాసీ బ్యాసిల్లరీ (పీబీ) అంటే కుష్ఠు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే పాసీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి ఆరు నెలలు చికిత్స ఉంటుంది.

మల్టీ బ్యాసిల్లరీ(ఎండి) అంటే ఐదు మచ్చల కంటే ఎక్కువ ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి 12 నెలల చికిత్స ఉంటుంది.

ఇంటింటా సర్వే చేయిస్తున్నాం

కుష్ఠు వ్యాధిపై జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వే చేయిస్తున్నాం. ఈనెల 18 నుంచి ప్రారంభించిన సర్వే ఆగస్టు 2 వతేదీ వరకు జరుగుతుంది. ఇప్పటి వరకు సర్వేలో 16 కొత్త కేసులు నమోదయ్యాయి. కుష్ఠు వ్యాధి నిర్ధారణ అయిన వారికి తక్షణమే చికిత్స ప్రారంభిస్తాం.

దాక్టర్ కె.రాణి, కుష్ఠు వ్యాధి నివారణ జిల్లా అధికారి

కవికి సమాజ దృష్టి ఉండాలి

● కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత బాలసుధాకర్ మౌళి

రాజాం సిటీ: కవికి సమాజ దృష్టి ఉండాలని, సమాజంలోని హెచ్చుతగ్గులను చిత్రీకరించగలగాలని, ఆవేదనలను, కన్నీళ్లను కవితాత్మకంగా రాసి ప్రజల హృదయాలను కదిలించాలని కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత బాలసుధాకర్ మౌళి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో రాజాం రచయితల వేదిక 114వ సమావేశం ఆది వారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యవక్తగా హాజరైన ఆయన ముందుగా వేదిక నిర్వాహకులు గార రంగనాథం రచించిన 'కాలం కత్తి మొనమీద' అనే కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏదో మూల ఎక్కడో ఒకచోట యుద్ధాలు, దోపిడీలు, తిరుగుబాట్లు జరుగుతూనే ఉన్నాయన్నారు. అలాంటి సమయాల్లో జరిగిన మార్పుల్ని, కలిగిన ఆవేదనలని కవిత్వీకరించగలిగిన వాడే గొప్ప కవి అవుతాడని పేర్కొన్నారు. అప్పుడే ప్రపంచ వ్యాప్తమైన కీర్తి గడిస్తాడని అన్నారు. పాలస్తీనా, ఉక్రెయిన్, సిరియా వంటి ప్రాంతాలలో యుద్ధాలు జరిగి వేలాది మంది హింసకు గురౌతున్నారని వివరించారు. నైజీరియా, లాటిన్ అమెరికా, శ్రీలంక, యూరోపియన్ దేశాలలో జరుగుతున్న అన్యాయాల మీద అక్రమాలపై అక్కడి వారి ఆవేదన మీద ఆయా ప్రాంతాలలో గొప్పకవులు కవిత్వాన్ని సృష్టించారని, అలాంటి కవిత్వం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. పిల్లా తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక సభ్యులు స్వామినాయుడు, భుజంగరావు, రంగనాథం తదితరులు పాల్గొన్నారు